# నాన్నా.. నీ విలువెంత?

## పాలకోడేటి సత్యనారాయణరావు

"నేను చెప్తాను, మీరు రాయండి, మీ కెందుకు?" అంది కాంచన.

రామమూర్తి తలెత్తి భార్యకేసి చూశాడు. "బాగుండదు అనిపిస్తోంది నాకు!"

"అలాగే ఇంత కాలము అనిపించింది. ఇకపై అలా అనిపిస్తే కుదరదు అని చెప్తున్నాను. ఒక్కసారి, ఒక్కసారంటే ఒక్కసారి చాలు, కొంచెం ధైర్యం తెచ్చుకొని రాసేయండి. అసలు నేను రాసేదాన్ని. కానీ అలారాస్తే బాగుండదు అని ఆలోచిస్తున్నాను."

"నేనూ అంతే! నేను రాసినా...."

"ఇక చాల్లెండి. రాయండి అనగానే రాయాలి- మొదలు పెట్టండి. ప్రియమైన నాన్నగారికి, నమస్కారం......."

రామమూర్తి ఈ సారి క్షణం ఆలోచించాడు-ప్రియమైన నాన్నగారికి అంటూ ఎంత ప్రియమైన సంగతి రాస్తున్నాడు తను!

—జీవితం!

ఎంత తమాషా చిత్రమో అది! ఒక్కసారి పంచ వన్నెలలో వికసించినట్లుగా కనిపిస్తోంది. బహుశా అది బాల్యం కాబోలు. ఏమీ తెలీని చిన్నతనం. అమాయకత్వం లోని అందాలు అవేకాబోలు!!

కొంచెం పెద్దయ్యాక-కేవలం ఒకే ఒక్క రంగు-కేవలం ఎర్రటి ఎరుపులో నిండి నట్లు కనిపిస్తోంది. ఎరుపు-అంటే రక్తానికి సంకేతం. ఆదేయువతకూ సంకేతం. కామానికీ అదే. సల సల కాగే రక్తం యువ వ లో కామాన్ని నింపే కాలం అది. అదే జీవితం ఎర్ర రంగులో నిండినట్లు కనిపిస్తోంది.

మరీ పెద్దయాక-జీవితం ఆఖరి దశలో పడ్డపుడు ఒకేఒక రంగును-నల్లటి నలుపును పులుముకొంటుంది. విషాదానికి సంకేతం ఇది. అన్నీ అనుభవించిన జ్ఞాపకాలే మిగులుతాయి. గత జీవితపు వైభవం తప్ప ఇంకే వర్తమానము ఉదరిల్లని జీవితం అది!!

ఇప్పుడు తను రెండోదశకు చేరాడు. అందుకే భార్య చెప్పినట్టు చేస్తున్నాడు. అయినా భార్య చెప్పేది సబబుగానే వుంది.

ఆడది-ఆలోచించి చెప్తే ఎంత తెలివి అందులో కనపడుతోంది కాబోలు! —తను ఆలోచించనివిషయాలను ఎన్నిటికో ఎంతతేలికగా ఆలోచించి తన తరఫున నిర్ణయాలు తీసుకొంది'!

కానీ ఇది ఎంత పెద్ద నిర్ణయం!


కాదనటమా?

కాదనటంలో తనకు సరైన అర్థం కనపడ్డం లేదు. తను చూస్తున్న విషయాన్ని విశ్లేషించి చెప్పటానికి వ్యాఖ్యానాన్ని జోడిస్తూ కాంచన అనే దాంట్లో ఏమాత్రం పొల్లు లేదు.

కాని అటు తండ్రి-కన్నతండ్రి....తన కోరికలకు నిచ్చెనలు పట్టి తన గమ్యం చేరేంత వరకు తోడిచ్చిన వ్యక్తి-అతన్ని కాదనడం — కాంచన ఉత్తరం చెప్తూనే వుంది.

రామమూర్తి ఆలోచనలు అటువేపు లేవు. అతనెక్కడో చాలకాలం కిందకు వెనక్కు వెనక్కు వెళ్ళి అక్కడ ఆగాడు.

అక్కడ- అప్పటికింక తను రామమూర్తి,



బి.ఇ. కాలేదు. పియుసి పాసై ఇంట్లో గోళ్లు గిల్లుకొంటూ కూర్చుండేరోజులు.

పై చదువులు చదవాలనే కోరిక.

కోరికలకు రూపం ఇవ్వలేని ఆర్థిక అసమర్థత,

అందుకే-రోజూ పేపర్ రాగానే రెండో పేజీలో ఖాళీగా ఉందంటూ కనపడే ఉద్యోగాల అన్వేషణ

ఆ రోజు తన జీవితంలో ఎంత గొప్ప రోజో అది!

పొరబాటున తను ఖాళీలను వెతుక్కొంటూ దారితప్పి ఆ ఇంజనీరింగ్ కాలేజీ ప్రకటన చదివాడు. పి.యు.సి. పాసయిన వాళ్లకు పరీక్షపెట్టి మొదట అయిదు స్థానాలలో వచ్చిన వాళ్లకు నెలనెలా స్కాలర్ షిప్ ఇస్తామంటూ ఆ ప్రకటన.

ప్రకటన చదివాడు. అందులో పై చదువులకు ఆహ్వానం ఉంది, సామర్థ్యం నిరూపించుకోమంటూ ఛాలెంజీ ఉంది. నెల నెల ఆదాయం ఉంటుందనే హామీ కూడా ఉంది.

ఇంకేం కావాలి!

అప్లికేషన్ పెట్టి చూశాడు. మామూలు తరహా దరఖాస్తు కాదది. తన భవిష్యత్తును తీర్చి దిద్దే దరఖాస్తే. అలాగే కష్టపడ్డాడు కూడాను! తన నమ్మకాన్ని పరీక్షకు పెట్టాడు.

నెగ్గాడు — కానీ దురదృష్టం కొంత వెన్నంటే ఉంది. అందుకే తను అయిదు స్థానాలలోకి చేరలేకపోయాడు. ఆరో వాడిగా తను నిలబడ్డాడు. నిలబడి కూలబడ్డాడు.

గెలవబోయి, ఓటమి అంచుల్లోకి చేరాడు.

— కానీ తండ్రి-తన్ను ఆదుకున్నాడు, 'పర్వాలేదు, నీలో ఇంత ప్రతిభ ఉందని తెలీదు నాకు. ముందుకే వెళ్లు. వాళ్లు ఇవ్వని స్కాలర్‌షిప్ నేనే ఇస్తాను. చేతకానిదయినా, నీకోసం ఏమైనా చేస్తా'నన్నాడు.

అలాగే చేశాడు. ఏం చేశాడో తనకు తెలీదు.

నెల నెలా అయిదారు తేదీల్లో తనకు డబ్బు ముట్టేది. హాస్టల్‌లో అందరికన్నా తనకు అందేది తక్కువే కావచ్చు, అయినా అందేది. దానికితోడు ఇంకొంచెం ప్రభుత్వం ఇచ్చిన మొత్తం.

— జీవితంలో పూర్తిగా ఓడిపోలేదు.

నెమ్మదిగా నెమ్మదిగా అక్షరాల్ని పేర్చుకొంటూ, అంకెల్ని చేర్చుకొంటూ, పేరుకు చివర్న రెండక్షరాల్ని కలుపుకోగలటం అదృష్టం అనిపించింది.

చిన్న గీతపక్కనే మరో గీతగీస్తే, అది దాని స్వతంత్రతం కోల్పోయి, అది పెద్ద గీతగానో, చిన్నగీతగానో మిగులుతుంది.

పేరుకు చివర్న రెండక్షరాలు చేరగానే జీవితంలో ఎంతో సాధించగలిగాడు తను అనుకొన్నాడు. కానీ ఆ తర్వాత మళ్లీ సాధించవల్సింది ఎంతో వుందని తెలిసిపోయింది. ఉన్న ఊళ్లో ఉద్యోగం సంపాదించుకోగలిగితే అంతకు మించి సాధించవల్సింది ఇంకేదీ లేదనిపించింది.

ఇంకేముంది తను కోరుకోవల్సింది? అనిపించింది తనకు.

కానీ ఆశ నిచ్చెనలాంటిది కాబోలు-ఒక మెట్టు ఎక్కేసరికి, ఎదురుగా కన్పిస్తు మరో మెట్టు-ఆ మెట్టును అధిరోహించే సరికి మళ్ళీ మరో మెట్టు-పరిమితి అంతే! ఆశ కన్పిస్తుంటే, కోరిక కనిపిస్తుంటే ఒక్కో మెట్టు ఎక్కటం తప్పనిసరి అనుకొంది కాబోలు!

కోరుకొన్న ఉద్యోగం - ఉన్న ఊళ్లోనే స్థిరపడగలిగే అవకాశం-అయినా ఇంకా కోరుకోవాల్సింది, చేయాల్సింది ఎంతో ఉందనిపిస్తోంది.

తనకన్నా అయిదేళ్ళు చిన్న-చిన్న. చిన్నాన్ని కూడ తనలాగే ఓ గట్టున పడేస్తే తనకు తృప్తి. నెలకో వందచొప్పున నాన్న తనకు పంపిన మనిఆర్డర్లలాగే ఇపుడు తను కొంచెం పెద్దోళ్లు పంపితే-వాడి జీవితం ఓ ఒడ్డున పడుతుంది.

కుటుంబం కొంచెం పుంజుకొంటుంది — పథకం ఆలోచన స్థాయినుంచి అమలు



పిచ్చుక గూటు క్రాఫ్



టి.వి. యస్సార్తి.

స్థాయిలోకి వచ్చింది.

తమ్ముడు చదువుతున్న రోజుల్లోనే కాంచనతో పెళ్ళి—భార్యఅంటే అర్థాంగే కాక తన ఆలోచనల్లో సైతం అర్థభాగం అయింది. అందుకే తమ్ముడి చదువు నిరాఘాటంగా సాగింది.

తమ్ముడి చదువు పూర్తవటం తనకు ఓ పెద్ద నిట్టూర్పు విడుచుకునే అవకాశం అయింది. కానీ ఆరోజున-అటు తమ్ముడి ఉత్సాహాన్నీ ఆనందాన్నీ పాడుచేస్తూ—అనొచ్చో అనకూడదో కానీ—నాన్న ఇంట్లో చిన్న మీటింగ్ పెట్టి ఓ బాంబు వేశాడు-"ఇన్నేళ్ళ చదువుకు ఇన్నేళ్ళ ఇంటి నిర్వహణకు ఇల్లు తాకట్టులో ఉంది-విడిపించండి!" అనేది తండ్రి చెప్పినమాట. అదే ముందు తెలిస్తే ...

ఏం చేసేవాడో కానీ తెలీలేదు-తనకు ఆలోచన అనవసరం.

చేయాల్సింది ఏముంది?-అప్పు తీర్చుకోవటం తప్ప!!

జీతం రాగానే ఇంటి కోసం కొంత, ఇంటి అప్పు తీర్చేందుకు మరి కొంత-ఉద్యోగం రాని తమ్ముడి పాకెట్ మనీ కోసం మరికొంత—చివరకు మిగిలేది తన కోసం-నిజానికి ఏముంటుంది కనుక ఇంకా మిగిలే?

అయినా జీవితం—అందరితోనూ పంచుకోవాలి కనీసం తన వాళ్ళతో-అదే తృప్తి తనకు కొండంత బలం ఇచ్చేది.

ఉద్యోగం కోసం తమ్ముడి ప్రయత్నాలు తనకు తెలీనివి కావు. ఇటు అండమాన్ నుంచి ఇటు చండీఘర్ వరకు-అన్ని రాష్ట్రాలకు, అన్ని ప్రదేశాలకు దరఖాస్తులు పెట్టేవాడు. వేలకొద్దీ రూపాయలు ఖర్చుచేసి ఇంటర్వ్యూకి వెడితే వాళ్ళు రెండక్షరాల్లో ఫలితాన్ని చెప్పేవారు "సారీ" అంటూ.

అయినా ఉద్యోగం కదిపుడు, ప్రయత్నం పురుష లక్షణం అవటంతో మరో ప్రయత్నం. దొరకని ఉద్యోగం కోసం, లభించని అవకాశం కోసం, అందని ఆకాశం కోసం - తీవ్రమైన ప్రయత్నాలు, ఇన్ని ఆరాటాలు!!

వంద రాళ్ళలో ఒక్కటి తగులుతుంది. నిజం-అలాగే జరిగింది తమ్ముడికి సిమ్లాలో ఉద్యోగం వచ్చింది తనకు ఉన్న ఊరిలో

ఉద్యోగం వస్తే, తమ్ముడికి దేశానికి ఆ చివర్న....

ప్రగతికి ఇదే కాబోలు నిదర్శనం!—ఇంతక్రితం ఊరి పొలిమేరలు దాటక్కర్లేకుండా ఉద్యోగాలు ఉండేవి — పొలాలన్నీ పచ్చగా నిండుగా ఉంటూ ఆ పైరుగాలిలోనే జీవితాన్ని వెళ్లబుచ్చుకొనే రోజులు కపుడు పోయాయి. ఊరు దాటి ఊరు పొలిమేరలు దాటి అలా అలా వెడితేకానీ ...

తమ్ముడి జీవితం కుదుట బడింది.

ఇక తమ కుటుంబం కుదుట పడుతోంది అనే ఆశ....

తమ్ముడు నెలనెలా ఓ అయిదారు వందలు పంపుతాడనే నమ్మకం,

మొదటినెల రెండు వందలు వచ్చాయి. కూడా ఓ సంజాయిషీ-

ఇక్కడకు కొత్తగా రావటం అన్నీ ఏర్పాటు చేసుకోడటం తప్పనిసరి. కనక.... అంటూ-

రెండో నెల రెండొందలు వచ్చాయి. మూడో నెల అది మూడు యాభైలకు తగ్గింది.

కాంచన-ఆడది. మగాడికన్న ముందు చూపు వున్నది-అందుకే అనేసింది-మీకన్నా మీ తమ్ముడు అరాకులు ఎక్కువ చదివాడు అని!

అర్థం కాలేదు తనకు ఆ రోజున-

కనీసం మూడు నెలలు గడచేసరికి తనకు అర్థం అయింది - తమ్ముడు తనకన్న తెలివైన వాడు అని !

కాంచన చెప్పినట్లు అప్పటినుంచీ జాగ్రత్త పడటం నేర్చుకున్నాడు.

తండ్రికి తెలీకుండా-పేపర్లో పడ్డ ఖాళీకి దరఖాస్తు పెట్టడం అలవాటయింది.

ఆఫీసు పనులమీద ఇంటర్వ్యూలకు వెళ్లేవాడు.

తండ్రికి తెలీకనే ఇలా చేయడం మోసం అనిపించేది. తప్పు అనిపించేది అన్యాయంగా కనిపించేది.

కానీ....

— జీవితాన్ని రూపాయి శాసించేంత కాలమూ ఇలాంటి మోసం తప్పదు. తండ్రిని కొడుకు, కొడుకును తండ్రి, రక్తాన్ని రక్తం, కణాన్ని మరో కణం—

— తండ్రి మరో ఊరికి ఏదో పనిమీద వెళ్లిన 'మంచిరోజును చూసుకొని, అప్పటికి పది రోజులక్రితం అందుకొన్న కొత్త కంపెనీ పోస్టింగ్ ఆర్డర్‌ను చేతపట్టుకొని—ఇల్లు కదలటం తప్పనిసరి అయింది. 'ముఖం చాటు చేసుకున్నాడు' అని అనుకొని ఉండొచ్చు తండ్రి.

అది తనకే తెలీదు—

అలా అనుకొన్నా ఏమీ అనగలిగే పరిస్థితే కాదు —

ఇల్లు మారింది. ఊరు మారింది.

—ఇన్నాళ్ళూ లేని కొత్త స్వతంత్రం. భార్యాభర్తల 'ఒంటరి' జంటజీవితం.

—పగలూ, రాత్రీ తేడా లేకపోవటం, ఏవస్తువుకూ, ఏకోరికకూ కొరత లేకపోవటం....

చూస్తూండగానే ఖర్చు పైసల్లోంచి రూపాయల్లోంచి పదులు, వందలసంఖ్యను సైతం అధిగమించటం....

—కాంచన ఇదంతా కావాలనే చేసిందా అనే అనుమానం తలెత్తదికాదు. కానీ ఇపుడు ఈ ఉత్తరం రాస్తోంటే —

అనుమానం సన్నగా, చిన్నగా, పొగలాగ ...

కానీ తాను దాన్ని కార్చిచ్చు చేయనివ్వడు-


తనకన్న తమ్ముడు వెనక పుట్టినా, ముందు అన్నీ నేర్చుకొన్నాడు.

తను నేర్చుకోక పోవటం కపుడు దుమార్గం కాకపోవచ్చు—కనీసం కాంచన దృష్టిలో.... !

ఉత్తరం మరోసారి చదివాడు—మనసు పెట్టక రాయటంతో ఏంరాశాడో తెలీనిస్థితి!

"...నమస్కారం—

మీకు తెలీందికాదు, నాకు ఉద్యోగం వచ్చి ఎనిమిదేళ్లు అయింది. గత అయిదేళ్లు



ఒక కారణంగా, ఆ తర్వాత మరో కారణంగా నేను ఇంటి కోసం ఖర్చుపెట్టిన మొత్తం చాల ఎక్కువగా వేఉంది. అంత మాత్రాన ఇంక నేను ఇవ్వకూడదని కాదు, ఇవ్వలేననీ కాదు.

కానీ—చిన్నా సంగతి మీకు తెలీదికాదు. కనీసం ఈనాడైనా నేను వాడిని చూసి కొన్ని పాఠాలు నేర్చుకోవాల్సిన అగత్యం ఏర్పడిందనాలి.

చిన్నాకా ఉద్యోగంవచ్చి రెండేళ్లు దాటింది. వాడినుంచి మీరు డబ్బు అందుకొన్నది కేవలం ఆరేడు నెలలకు మించి లేదు. మరి మిగిలినదంతా ఏం అయినట్లు? ఏం చేస్తున్నట్లు??

రేపటి కోసం తమ్ముడు దాచుకొంటున్నాడని నేను అనను. కాని నేను ఈ రోజుగురించి పట్టించుకోవటం మానేసానే అనిపిస్తుంది. అందుకే-క్షమించండి. ఇకమీద నుండి నేను మీకు డబ్బు పంపలేకపోతున్నానని రాయాల్సివస్తోంది ఈ నెలకు మాత్రం మీకు అయిదు వందలు పంపుతున్నాన—....

ఉత్తరం అయిపోయింది.

చేతులు వణుకుతోంటే ఉత్తరం కింద "రాముడు" అని సంతకం చేశాడు.

కాంచన సాయంత్రం బజార్లో నడుస్తూ పోస్ట్ బాక్స్ దగ్గర ఆగి ఆ ఉత్తరాన్ని హేండ్ బాగ్‌లోంచి తీసి పోస్ట్ చేస్తున్నపుడు, ఉత్తరం ఉన్న అరలోనే, అదే బాగ్‌లో వంద రూపాయల నోట్లు ఆరేడు కనపడినవుడు, రామ్మూర్తికి ఒకసారి ఆత్మహత్య చేసుకొన్నట్లుగా అయింది.

కానీ ఆ అంతరాత్మ గొంతును రూపాయినోటు, పిసికి పిసికి చంపేసింది.

రామ్మూర్తిముఖంలో ఆ హత్యచ్ఛాయలు స్పష్టంగా కనపడ్డా కాంచన ఏమీ అనలేదు. భర్త అంతరాత్మ ఆత్మ హత్యతో సహగమనం చేయలేదు కాంచన ఆత్మ.

కాంచన ఆక్షణంలో-బజారులో కొనాలనుకొంటున్న బంగారపు గొలుసు గురించి ఆలోచిస్తోంది.

షాపులో-భర్త ఎన్నుకొన్న గొలుసును-ఆమె మెడకు అలంకరిస్తూ రామ్మూర్తి-ఆక్షణంలో ఉలికి పడ్డాడు. ఆ బంగారపు గొలుసు తండ్రి గొంతుకు తను వేస్తున్న ఉరిత్రాడులాగా అనిపించింది అతనికి!! ✱